రహా'దారుణం'

- ప్రమాదకరంగా అంతర్రాష్ట్ర రహదారి
- పలుచోట్ల గుంతలు.. నిలిచిన వర్షపు నీరు
- కల్వర్టులు నిర్మించడంలో ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం

అయిజ, ఆగస్టు 11: అయిజ పట్టణం నుంచి కర్నూల్‌కు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదకరంగా మారింది. బీటీ రోడ్డు పూర్తి చేసినా కల్వర్టులు, నెట్టెంపాడ్ కాల్వలు ఏర్పాటు చేసినా కల్వర్టులపై బీటీ, సీసీ వేయడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. అయిజ నుంచి వెంకటాపురం వరకు దాదాపు మూడు ప్రదేశాల్లో కల్వర్టులు నిర్మించి బీటీ వేయాల్సి ఉన్నది. బీటీ రోడ్డు పూర్తి చేసినా కల్వర్టుల వద్ద బీటీ వేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయకపోవడంతో గుంతలు ఏర్పడి ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డారు. కొందరు క్షతగాత్రులయ్యారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

అయిజ-కర్నూల్ రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

అయిజ పట్టణ సమీపంలోని పెద్దవాగు వద్ద, దర్గా, పర్దిపురం తదితర ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, దర్గా, వెంకటాపురం సమీపంలో నెట్టెంపాడ్ కాల్వలపై బీటీ, సీసీ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా, అవేవీ చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేసి బీటీ రోడ్డు వేయాలని అంతర్రాష్ట్ర ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారిపై మురుగు

అయిజ, ఆగస్టు 11: అయిజ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై మురుగు నిలిచిపోవడంతో జనం రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు రహదాపైనే నిలుస్తోంది. నిత్యం గద్వాలకు వందలాది వాహనాలు రహదారి గుండా వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మురుగు రోడ్డుపై నిలువడంతో భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో బాటసారులపై పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నిల్వ లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అయిజలోని గద్వాల రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

చిత్తడి రోడ్డును చక్కదిద్దేదెవరు?

ధరూరు, ఆగస్టు 11: ఏ చిన్నపాటి వర్షం పడినా రోడ్డు చిత్తడిగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందలకు గురవుతున్నారు. బాటసారుల ఇక్కట్లను పట్టించుకుందామన్న ఆలోచన అధికారులు, పాలకులకు రాకపోవడం శోచనీయం. ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా ఎరుకలి వీధి వద్ద రాయిచూరు-గద్వాల ప్రధాన రహదారి దుస్థితి దయనీయమంగా మారింది. నాలుగేండ్లుగా ఇదే దుస్థితి కొనసాగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. రోడ్డు పరిస్థితిని చక్కదిద్దే నాథుడే లేడాయే. సర్కారు కూడా నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రాయిచూరు-గద్వాల రోడ్డులో ఇక్కట్లు పడుతున్న వాహనదారుడు

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఆగస్టు11: ప్రభుత్వం అందించే సీఎం సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన లబ్ధిదారురాలు సరోజ చికిత్స నిమిత్తం మంజూరైన రూ.లక్షా2వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదవారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, చంద్రశేఖర్, నరిసంహా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు, ఆగస్టు 11: పట్టణంలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పెబ్బేరు-వనపర్తి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రంజిత్‌కుమార్, సురేందర్‌గౌడ్, వెంకటేశ్‌సాగర్, రాములు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వనపర్తి టౌన్, ఆగస్టు 11: జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఐద్వా సంఘం నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ.. భగత్‌సింగ్ నగర్ కాలనీలో సీసీ రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, మురుగు కాల్వల్లేక మురుగు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఇండ్ల మధ్య పిచ్చిమొక్కలు మొలిచాయని, కంపచెట్లు పెరిగాయని, నీరు నిల్వ ఉండడంతో తేళ్లు, పాములు ఇండ్లలోకి వస్తున్నాయని ఆరోపించారు. గతంలో ఎన్ని మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పరిష్కరించలేదని పేర్కొన్నారు. నీరునిల్వ ఉండడంతో ఇంటి పునాదులు కిందకు దిగుతున్నాయని, విద్యుత్ షాక్‌లు వస్తున్నాయని ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం అధ్యక్షురాలు సాయిలీల, బాలకిష్టమ్మ, ప్రసన్న, యాదమ్మ, శివమ్మ, అ లివేల, రేణుక, చంద్రమ్మ, సువర్ణ, కాం తమ్మ, మౌనిక, సుదర్శన్, ఖాజా ఉన్నారు.

కుక్కలదాడిలో గొర్రె పిల్లలు మృతి

గోపాల్‌పేట, ఆగస్టు 11: కుక్కలదాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని తాడిపర్తిలో చోటు చేసుకున్నది. బాధితుడు నక్క రాములు కథనం మేరకు.. నక్క రాములుకు చెందిన గొర్రె పిల్లలను శనివారం వాటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప జాలీలో ఉంచి అతడు ఇంట్లో నిద్రించాడు. అదేరోజు రాత్రి వీధి కుక్కలు జాలీలోకి ప్రవేశించి 20 గొర్రె పిల్లలను గాయపర్చాయి. ఈ ఘటనలో 10 దాకా గొర్రె పిల్లలు మృతిచెందగా.. 10 గొర్రెపిల్లల పరిస్థితి విషయమంగా ఉన్నట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలు



ఆత్మకూర్‌లోని విశ్వభారతి ఉన్నత పాఠశాలకు చెందిన 2000-01 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని గురువులను సన్మానించారు.

– ఆత్మకూరు, ఆగస్టు 11

హామీలను అమలు చేయాలి

అమరచింత, ఆగస్టు 11: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోతోపాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని వ్యవసాయ కూలీలను కలిసి కూలి రేట్ల పెంపునకు చేపట్టే ఉద్యమాలకు ఐక్యంగా కలిసి రావాలని కోరుతూ కరపత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు జాతీయ వేతన బోర్డు సిఫారసులను అమలు చేస్తూ పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే రేషన్‌షాప్‌ల ద్వారా రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు 14 రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తామన్న హామీతోపాటు ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

పాన్‌గల్, ఆగస్టు 11: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు ద్విచక్ర వాహనాలకు నెంబర్‌ప్లేట్ లేకుండా తిరగడం, మైనర్లు డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపడం, మొబైల్ రైడింగ్, త్రిపుల్ రైడింగ్, మితిమీరిన వేగం, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నడపడం చర్యలకు పాల్పడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరి

అమరచింత, ఆగస్టు 11: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని అమరచింత ఎస్సై సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకే చాలాసార్లు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, మొదటిసారిగా భావించి తక్కువ జారిమానాలు వేసినా.. వాహనదారుల్లో మార్పు రావడం లేదని పేర్కొన్నారు. ఇకనుంచి ప్రతిఒక్క వాహనదారు విధిగా డ్రైవింగ్, లైసెన్స్, వాహన పత్రాలను వెంటపెట్టుకోవాలని సూచించారు. అలాగే నెంబర్ ప్లేట్ లేకుండా, త్రిబుల్ రైడింగ్, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం తదితర నిబంధలను అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గోపాలపేట, ఆగస్టు 11: మండలంలోని పొల్కెపహాడ్‌కు చెందిన తెలుగు వెంకటమ్మ (55), ఎర్రమోని బాలమ్మ (65) శనివారం మృతి చెందారు. ఆదివారం మృతుల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున అందజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జి మంద సత్యశీలారెడ్డి, వెంకటస్వామి, రవి, చరణ్, అశోక్‌రెడ్డి, బంగారయ్య, మహేశ్ ఉన్నారు.

బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొత్తకోట, ఆగస్టు 11: మండలంలోని వడ్డెవాటకు చెందిన సత్యారెడ్డి కుమారుడు సాయికుమార్ రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధితుడిని ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గుంతమల్లేశ్, చెన్నకేశవరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్

పాన్‌గల్, ఆగస్టు 11: మొక్కలు విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మాందాపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరిపడా చెట్లులేక అసమతుల్యంతో పర్యావరణం దెబ్బతిని మానవ మనుగడకు ముప్పు ఏర్పడిందని తెలిపారు. తనవంతుగా సాగర్ స్నేక్ సొసైటీ ఆధ్వర్యంలో జూన్ 22న అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు 17రోజులపాటు పాదయాత్ర చేస్తూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం, పెంచడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, రాజు, శేఖర్, రఘు, సాయిలు, ప్రభాకర్, హేమవర్ధన్, మధు, అవినాశ్, రోహిత్‌సాగర్ పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్

విరాళాలు ఇద్దాం.. మానవత్వాన్ని చాటుదాం

విరాళాలు సేకరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 11: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన ప్రజల సహాయార్థం విరాళాలు ఇచ్చి మానవతను చాటుకుందామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దేవని ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బోనమ్మతండా, లక్ష్మీనర్సింహకాలనీల్లో విరాళాలు సేకరించారు. విరాళాలాలు అందజేసిన దాతలకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు నారాయణ, గట్టయ్య, రఘు, రవి, అక్బర్, గోపాల్, విద్యాకిరణ్, అంజి, మన్నెంకొండ, నాగరాజు తదితరులు ఉన్నారు.

సమాజ చైతన్యానికే సాహిత్యం, కళలు

గద్వాల అర్బన్, ఆగస్టు 11: సాహిత్యం, కళలు, సమాజ చైతన్యానికి దోహదపడతాయని ప్రజానాట్య మండలి కార్యదర్శి ఆశన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లో అదివారం ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. విద్య, విజ్ఞానం, మూడనమ్మకాలు, సామాజిక చైతన్యం తదితర అంశాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కవులు, కళాకారులపై ఉన్నదని తెలిపారు. అలాగే చనిపోయిన కళాకారులు, విపత్తులో చనిపోయిన కళాకారులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, సహాయ కార్యదర్శి లక్ష్మి, జిల్లా నాయకులు అభిషేక్, తిమ్మప్ప, సురేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి సమావేశంలో పాల్గొన్న కళాకారులు

రక్షణ 'కంచె' కరువు

- బీచుపల్లి పుష్కరఘాట్ చెంత సందర్శకులకు కొరవడిన భద్రత
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కృష్ణానది

ఇటిక్యాల, ఆగస్టు 11: బీచుపల్లి క్షేత్రంలోని కృష్ణానది పుష్కరఘాట్ చెంత రక్షణ ఏర్పాట్లు లేక ప్రమదాలు చోటు చేసుకునే పరిస్థితి నెలకొన్నది. నడిగడ్డ ఇలవేల్పుగా ప్రసిద్ధి గాంచిన బీచుపల్లి క్షేత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ముఖ్యంగా పర్వదినాలు, సెలవు దినాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కృష్ణానదిలో వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అయితే క్షేత్రంలోని పుష్కరఘాట్ చెంత ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశముంది. 2004 పుష్కరాల సమయంలో ఘాట్ మెట్లు, పుష్కరిణి వద్ద ఇనుప రేలింగ్‌తో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల పుష్కరఘాట్ వద్ద నది అందాలను వీక్షించేందుకు వచ్చే భక్తులకు రక్షణగా ఉండేది. కాలక్రమేణా ఇనుప కంచె తుప్పు పట్టి పాడయిపోయింది. దీంతో పుష్కరఘాట్ రక్షణ ప్రయాదంలో పడింది. క్షేత్రంలో వివిధ రూపాల్లో వసూలు చేపడుతున్న ఆలయ కమిటీ, పంచాయతీ వారు ప్రమాదాలు నివారించడానికి చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు విమమర్శిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రామన్‌గౌడ్ స్పందిస్తూ రెండుమూడు రోజుల్లో ఇనుప కంచెతో ఏర్పాటు చేయిస్తామన్నారు.

బీచుపల్లిలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నది వద్ద భక్తులు

నెట్టెంపాడు కాల్వలకు జలకళ

మల్దకల్, ఆగస్టు 11: ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి మెయిన్ కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతో కళకళలాడుతున్నాయి. నెట్టెంపాడు కాల్వలో భాగంగా 106 ప్యాకేజీ కింద పెద్ద కాల్వలు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని కాల్వల ద్వారా గట్టు మండలంలోని వివిధ గ్రామాల వరకు ఈ నీరు చేరుకుంటున్నది. కాల్వలకు నీటిని వదలడంతో మండలంలోని దాసరిపల్లి, ఎల్కూర్ పెద్ద చెరువు, మల్దకల్ చెరువు, అమరవాయి పెద్దచెరువు, ఎద్దుల గూడెం చెరువుతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చిన్న కుంటలు నిండుతున్నాయి. నీటిని వదలడంతో వ్యవసాయ బావులు, బోర్లలో నీటిమట్టం పెరిగుతోందని, రాబోయే రోజుల్లో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మల్దకల్ వద్ద కాల్వలో పారుతున్న నీరు

ర్యాలంపాడులో 1.52 టీఎంసీల నిల్వ

గట్టు, ఆగస్టు 11: నెట్టంపాడులో భాగమైన ర్యాలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 1.52టీఎంసీల నీటినిల్వ నమోదైంది. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులుగా ఉన్నది. రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వ(104ప్యాకేజీ)కి 286 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, కుడి కాల్వకు 697 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ర్యాలంపాడు రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 4టీఎంసీలు కాగా కట్ట బలహీనంగా ఉండడంతో 2టీఎంసీలలోపే నీటిని నిల్వ చేయనున్నారు.

ర్యాలంపాడు రిజర్వాయర్

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఉపకార వేతనాలు అందజేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 11: జిల్లావ్యాప్తంగా ఉన్న పేద విద్యార్థులకు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందజేశారు. ఆర్థికంగా వెనుకబడి వృత్తి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవా సమితి కల్యాణ మండపంలో ఉపకార వేతనాలను అందజేశారు. అందులో సి.నిఖిత ఎంబీబీఎస్ విద్యార్థినికి రూ.25వేలు, బీటెక్ విద్యార్థులు నందిత, రిషిత, వర్షిత, మణిదీప్‌రెడ్డికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందజేసినట్లు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు నారాయణ రెడ్డి, కార్యదర్శి మేఘారెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొత్తకోట, ఆగస్టు 11: త్రైత సిద్ధాంత ఆచార్య ప్రభోదానందా యోగీశ్వరులు రాసిన భగవద్గీతను ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీతో పాటు మరికొన్ని వీధుల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శిఖరంపై కలశస్థాపన

రాజోలి, ఆగస్టు 11 : మండల కేంద్రంలో వెలిసిన అడివేశ్వర స్వామి ఆలయ శిఖరంపై ఆదివారం కలశ ప్రతిష్ఠ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఈరమ్మ కుటుంబ సభ్యులు కలశ ప్రతిష్ఠ దాతలుగా వ్యవహరించగా.. కుటుంబ సభ్యులు వీరేశ్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్, కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, పూజారులు అడివిస్వామి, వినోద్‌స్వామి పాల్గొన్నారు.


కలశాన్ని తీసుకెళ్తున్న దంపతులు

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదారును కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌హౌక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేదీ: **22 ఆగస్టు 2024**న **మ. 12.30** గం. నుండి **మ. 3.30** గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	జడ్చర్ల TG	xxxxxxxxxxx0760	మహమ్మద్ జహంగీర్	87078.64	22-జూలై-24	24.1	22.8
2	వనపర్తి TG	xxxxxxxxxxx7889	గుబ్బ శ్రీనివాసులు	189323	07-జూన్-24	53.7	52.33
3	వనపర్తి TG	xxxxxxxxxxx9816	లవద్య లక్ష్మణ్	177466	07-జూన్-24	46.9	40.22

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో **మ. 12.30** గం. నుండి **మ.3.30** గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్